క్లుప్తంగా

30న చిత్రకళా ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉగాది, ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా 30వ తేదీ ఆదివారం ముత్యాలంపాడు ఎంఎస్ మూర్తి ఆర్ట్ గ్యాలరీలో ఉగాది చిత్రోత్సవ చిత్రకళా ప్రదర్శన నిర్వహించనున్నట్లు అకాడమీ కార్యదర్శి ఎంవీ సాయిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి వివిధ నగరాలకు చెందిన 26 మంది చిత్రకారులు ఉగాదికి సంబంధించి గీసిన చిత్రాలను ప్రదర్శిస్తారన్నారు. అలాగే ప్రముఖ చిత్రకారులు సనిరి నాగేశ్వరరావు, కళా పోషకులు అయోధ్య నాగేశ్వరరావు, బి. నగేష్ కుమార్‌లను సత్కరిస్తారన్నారు. చిత్రకళా ప్రదర్శనలో కళాభిమానులు పాల్గొని తిలకించాల్సిందిగా నిర్వాహకులు మల్లిక్, దుర్గాప్రసాద్, సృజన్ కోరారు.

200 మందికి అన్నప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. శోంఠి జ్యోతిర్మాను, శోంఠి విజయలక్ష్మి ఆధ్వర్యంలో రెండు వందల మందికి అన్నప్రసాదం అందజేశారు. ఉదయం దేవాలయంలో మురళీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ 30వ తేదీ విశ్వావసు నూతన సంవత్సరం సందర్భంగా దేవాలయంలో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమంలో భక్తుల స్వయంగా పాల్గొనవచ్చని తెలిపారు. సాయంత్రం డాక్టర్ క్రోవి పార్థసారథిచే పంచాంగ శ్రవణం ఉంటుందని పేర్కొన్నారు.


స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

పాయకాపురం(విజయవాడరూరల్): తక్కువ ధరకే సురక్షిత తాగునీరు అందించటానికి ముందుకు వచ్చిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు కొనియాడారు. 62వ డివిజన్ పాయకాపురం రైతుబజార్‌లో శుక్రవారం యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడమేరు వరదల సమయంలో ఇక్కడ సమస్యలను గుర్తించిన సంస్థ ప్రతినిధులు ఇక్కడ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రైతుబజారులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సింగం వెంకన్న, మాజీ కార్పొరేటర్ పైడి తులసి, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సీఈఓ రేఖ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులపై వడ్డీ రాయితీకి విశేష స్పందన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు నగరవాసులు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీకి విశేష స్పందన వచ్చిందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం వరకు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో రూ.10.50 కోట్లు పన్ను బకాయిలను వసూలు చేశారని ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకుని మార్చి 31 లోపు తమ ఆస్తిపన్ను ఖాళీ స్థలాల పన్ను బకాయిలు చెల్లించి 50 శాతం వడ్డీ రాయితీని పొందవచ్చని తెలిపారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం నగర పరిధిలో గల 13 క్యాష్ కౌంటర్లు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తాయని, వీటితోపాటు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న 286 సచివాలయాల్లో కూడా పన్నులు వసూలు చేస్తారని, ఆయా సచివాలయాలన్నీ ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పన్ను బకాయిలు చెల్లించటానికి క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.


దుర్గమ్మకు దర్బార్ సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దర్బార్ సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష కుంకుమార్చన వేదిక వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గత వారం రోజులుగా ఆలయంలో జరిగిన విశేషాలు, పూజాది కార్యక్రమాలతో పాటు దేవస్థానానికి వచ్చిన ఆదాయ వ్యయాలను వివరించారు. దర్బార్ సేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

తుది దశకు తాగునీటి పథకం పనులు

- 30వ డివిజన్‌లో తీరనున్న 'పానీ'పాట్లు
- ఇంటింటికీ రానున్న కృష్ణాజలాలు
- గత ప్రభుత్వ హయాంలోనే రూ. 3.3కోట్లతో పనులు ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఓవర్‌హెడ్ ట్యాంక్



అంతర్గత రోడ్లలో వేసిన వాటర్ పైపులైన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్‌లో ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఇప్పటి వరకు ఈ ప్రాంత వాసులు బోర్ నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కృష్ణా జలాలు సరఫరా చేయాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. అయితే ఇక్కడ వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు అవసరమైన స్థలం లభించలేదు. దీంతో స్థానిక రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, స్థానిక పెద్దలతో మాట్లాడి టీడీఆర్ బాండ్లు కేటాయించి ప్రైవేటు స్థలం తీసుకుని వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించారు.

పూర్తయిన వాటర్ పైపులైన్ పనులు..

30వ డివిజన్‌లో గత ప్రభుత్వ హయాంలోనే వాటర్ పైపులైన్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం అంతర్గత రోడ్లకు సైతం పైపులైన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సాధ్యమైనంత త్వరలోనే తాగునీటి సరఫరా చేయాలనే ఉద్దేశంతో అధికారులు పనిచేస్తున్నారు. ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేయాలనే ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు.

రూ. 3.29 కోట్ల వ్యయంతో..

ఈ ప్రాంత వాసుల అవసరాలకు అనుగుణంగా గంగిరెద్దుల దిబ్బ నుంచి జీవీఆర్ నగర్ వాటర్ ట్యాంక్ వరకు రూ. 3.29 కోట్ల వ్యయంతో మంచి నీటి సరఫరాకు 400 ఎంఎం పంపింగ్ మెయిన్ లైన్ పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశారు. ఇంతలో ప్రభుత్వం మారటంతో పాటు వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తికాకపోవటంతో తాగునీటి సరఫరా ప్రారంభం కాలేదు. వేసవి ఎండలు ప్రారంభమయ్యేలోపు తాగునీటి సరఫరా చేయటానికి సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి.

అందుబాటులోకి రానున్న కృష్ణా జలాలు

వాటర్ ట్యాంక్ వినియోగంలోకి తీసుకువస్తే జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ ప్రాంత వాసులకు కృష్ణా జలాలు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటి వరకు ఈ ప్రాంత వాసులు కేవలం బోర్ వాటర్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడకు అత్యంత సమీపంలో బుడమేరు ఉండటం వల్ల బోర్ వాటర్ కలుషితం అవుతుందని ఇప్పుడు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ వినియోగంలోకి తీసుకువస్తే కృష్ణాజలాలు తమకు అందుబాటులోకి వస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గురువులపై కక్ష సాధింపు తగదు



మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపులకు దిగుతోందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. విద్యా సంవత్సరం ముగుస్తున్నా.. విద్యార్థులకు తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదని ప్రశ్నించిన చిత్తూరు కాణిపాకానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు జ్యోతి కుమార్‌పై తప్పుడు కేసులు బనాయించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గౌరవ స్థానంలో ఉండే ఉపాధ్యాయులు ఏపీలో ఈరోజు ప్రభుత్వ కక్ష సాధింపునకు గురవుతుండటం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, లోపాల్ని ప్రశ్నించేవారిని, సామాజిక మాధ్యమాల్లో గళమెత్తే వారిపై ఈ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థపై బాధ్యతగా, విద్యను అందించే గురువులపై గౌరవంగా వ్యవహరించాలని మల్లాది విష్ణు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం తప్పక నేర్పుతారని హెచ్చరించారు.

ఆలయ బాధ్యతలు బౌద్ధులకు అప్పగించాలి

బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా డిమాండ్



జ్ఞాన దీక్షలో పాల్గొన్న బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బిహార్ రాష్ట్రంలోని మహాబోధి– మహా విహార్ ఆలయంపై పూర్తి బాధ్యతలు బౌద్ధులకు అప్పగించాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. ఈ మేరకు బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు మహా జ్ఞాన దీక్ష చేపట్టింది. ఈ దీక్షలో క్రైస్తవులు, ముస్లిం, సిక్కు గురువులు పాల్గొన్నారు. ఈ ధర్నాలో పాల్గొన్న సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై. హరిబాబు మాట్లాడుతూ ఆలయ బాధ్యతలు పూర్తిగా బౌద్ధులకు అప్పగించాలని, బౌద్ధులకు వ్యతిరేకంగా బిహార్ ప్రభుత్వం తీసుకొచ్చిన బీటీ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 ప్రకారం ప్రతి మతానికి తమ మతపరమైన వ్యవహారాలను స్వతంత్రంగా నిర్వహించే హక్కు ఉందని గుర్తుచేశారు. జ్ఞాన దీక్షలో ఫాదర్ మువ్వల ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్ కరుణానిధి, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ సభ్యులు పాల్గొన్నారు.

6నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు



సీతారామ కల్యాణ మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో వచ్చేనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మందిర కమిటీ ఆధ్వర్యాన సీతారాముల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. స్థానిక ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం సీతారామ కల్యాణ మహోత్సవ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌతం రెడ్డి మాట్లాడుతూ 6వ తేదీ ఆదివారం ఉదయం 5.45 గంటలకు బాబావారికి కాగడ హారతితో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 6.30 గంటలకు బాబావారికి మహన్యాస పూర్వక పంచ సూక్తాలతో పంచామృత అభిషేకం, 7 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం,10 గంటలకు కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు సీతారాములకు సహస్ర నామార్చన, 6.30 గంటలకు హిందూ ముస్లిం ఐక్యతను తెలిపే విధంగా షిర్డీలో మాదిరిగా మేళతాళాలు, కోలాట నృత్యాలు, సాయినామ సంకీర్తనలతో ముత్యాలంపాడు పురవీధులమీదుగా ప్రత్యేకంగా అలంకరించిన రథంపై బాబావారి చందనోత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయన్నారు. 10వ తేదీ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, రాత్రి 7.30 గంటలకు సీతారాముల పవళింపు సేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

30న ఉగాది వేడుకలు..

30వ తేదీ ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బాబావారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయన్నారు. సాయంత్రం 7 గంటలకు ప్రముఖ జ్యోతిష్య పండితుడు బ్రహ్మశ్రీ పుచ్చా శ్రీనివాసరావుచే పంచాంగ శ్రవణం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మాడు పగులుతోంది!

ఎండలు ముదురుతున్నాయి. భానుడు తన ప్రతాపం చూపడం మొదలు పెడుతున్నాడు. రాత్రి, ఉదయం వేళల్లో పొగమంచు ప్రభావం చూపుతున్నప్పటికీ మధ్యాహ్నం వేళల్లో సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. దీంతో ప్రజలు బయటకొచ్చేటప్పుడు రక్షణగా గొడుగులు, స్కార్ఫ్‌లు ధరిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డు వద్ద కనిపించిన దృశ్యాలను చిత్రాల్లో చూడొచ్చు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





బాబా మందిరంలో మాస శివరాత్రి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శుక్రవారం మాసశివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. మందిరంలోని మరకత శివలింగానికి మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి విశేషంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అన్నాభిషేకం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు మాసశివరాత్రి పూజలలో పాల్గొని స్వామివారికి స్వయంగా అభిషేకం చేసుకుని, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య




గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలికల రక్షణ కోసమే పోక్సో చట్టం చేశారని, అనేక నగరాల్లో ఈ చట్టం అమలుకు జిల్లా కోర్టులు ఉన్నాయని సీనియర్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం గవర్నర్ పేటలోని ఐఏసీఈ నందు వాసవ్య మహిళా మండలి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మచిలీపట్నం వారి సౌజన్యంతో పోక్సో చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా బాధిత పిల్లలు నష్టపరిహారం పొందవచ్చన్నారు. చిన్నారులు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల సమాచారం మీలో ఎవరికైనా తెలిస్తే 1098, 112 అనే చైల్డ్ హెల్ప్ లైన్, టోల్ ఫ్రీ నంబర్లకు తెలియజేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సదస్సులో వాసవ్య మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధిక అశోక్, లీగల్ ఎడ్వైజర్ పిట్టల గోవింద్, పగిడపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

30న వేంకటేశ్వరుని సన్నిధిలో వేద సభ

విజయవాడ కల్చరల్: కంచికామకోటి పీఠం, లబ్బీపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 30వ తేదీ ఆదివారం తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా వేద విద్వత్ సభను నిర్వహిస్తునట్లు దేవస్థానం కార్యనిర్వాహకుడు డాక్టర్ సి. రామ్మోనరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 7 గంటలకు ఉగాది ప్రసాద వితరణ, 8 గంటలకు నవ గ్రహహోమం, 9గంటలకు వేద సభ, చివరిగా తంగిరాల వెంకట పూర్ణ సిద్ధాంతిచే పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలి



నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు భవిష్యత్తులో అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్ పర్సన్ నరెడ్ల శైలజ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో శుక్రవారం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపీ ట్రాన్స్‌కో రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ వై.కేశవాచార్యులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల సాధించిన ప్రగతి, అకడమిక్ వివరాలు తెలియజేశారు. సెప్టెంబర్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ, ఎన్. సత్యనారాయణరెడ్డి బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్.గోపాలకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరిశోధనలపై ముందుకెళ్తున్న ఎస్ఎంసీ

ధన్వంతరి విగ్రహావిష్కరణ సభలో ఎన్ఎంసీ చైర్మన్ డాక్టర్ విజయ్ ఓజా



ధన్వంతరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్ఎంసీ చైర్మన్ విజయ్ ఓజా, పక్కన ఇతర అతిథులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల వైద్య పరిశోధనలలో ముందుకు వెళ్తుండటం అభినందనీయమని నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ విజయ్ ఓజా అన్నారు. వైద్య కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ధన్వంతరి విగ్రహాన్ని శుక్రవారం డాక్టర్ విజయ్ ఓజా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య కళాశాల భవిష్యత్తులో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ నరసింహం, అదనపు డీఎంఈ డాక్టర్ రఘునందన్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సత్యనారాయణ, ఏడీలు కె.విజయలక్ష్మి, శ్రీకాంత్, డాక్టర ఆర్.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్ సందర్శన

నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ విజయ్ ఓజా ప్రభుత్వాస్పత్రిలోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఎంఆర్ఐ స్కాన్‌ను పరిశీలించారు. అనంతరం ఆ ఫ్లోర్‌లో ఉన్న ఓపీ విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఐదో అంతస్తుకు వెళ్లి ఆపరేషన్ థియేటర్స్‌ను పరిశీలించారు. ఆ థియేటర్స్‌లో అందుబాటులో ఉన్న పరికరాలు, నిర్వహిస్తున్న శస్త్ర చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య కళాశాలకు చేరుకుని ఏసీ లెక్చర్ హాలులో టీచింగ్ వైద్యులు, పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్ జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వివరణ ఇచ్చారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



నిందితుడితో పాటు రికవరీ చేసిన వాహనాలను చూపుతున్న ఎస్ఎన్‌పురం పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వరుస ద్విచక్ర వాహనాల చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం నార్త్‌జోన్ ఏసీపీ స్రవంతి రాయ్ ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఇటీవల వరుస ద్విచక్ర వాహనాల చోరీ కేసులపై నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ సూచనలతో ఏసీపీ స్రవంతి రాయ్ ఆధ్వర్యంలో ఎస్ఎన్‌పురం సీఐ ఎస్.వి.వి.లక్ష్మీ నారాయణ పర్యవేక్షణలో పోలీసులు ప్రత్యేక గాలింపు చేపట్టారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చోరీలకు పాల్పడింది పశ్చిమగోదావరి జిల్లా, పెరవల్లి మండలంలోని అజ్జారం గ్రామానికి చెందిన పల్లంగి సుబ్బరాజుగా గుర్తించి అతడిని అరెస్టు చేశారు. విచారణలో అతను ఇచ్చిన సమాచారం మేరకు వేర్వేరు ప్రాంతాలలో ఉన్న అతను చోరీలు చేసిన ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ కనకదుర్గ

మధురానగర్(విజయవాడసెంట్రల్): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని.. వాటి వినియోగం వల్ల విలువైన జీవితం నాశనం అవుతుందని విజయవాడ పశ్చిమ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సబ్–ఇన్‌స్పెక్టర్ కనకదుర్గ అన్నారు. కళాశాల విద్యావిభాగ సంచాలకుల ఉత్తర్వుల మేరకు కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే సమాజంలో కలిగే దుష్పరిణామాలను, ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు వివరించారు. ఇక్కడ తెలుసుకున్న అంశాలను తమ చుట్టు పక్కల ప్రాంత వాసులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు అందరూ బాగా చదువుకొని తాము ఎంచుకున్న రంగాలలో ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ కళాశాల అధ్యాపకులు సత్యవాణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్యార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో తిరుపతికి చెందిన శ్రీ సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు నృత్యకారులు శుక్రవారం నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నృత్యాచార్య శరత్‌చంద్ర పర్యవేక్షణలో సుమారు 20 మంది కళాకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలను ప్రదర్శించారు. అమ్మ వారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. అనంతరం నృత్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం సహాయ నిధి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు పంపిణీ చేశారు. 64వ డివిజన్‌కు చెందిన వై. కమలాకర్‌కు రూ. 91,033 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా దివ్యాంగులకు అవసరమైన పరికరాలు సహాయం అందిస్తున్నట్లు బోండా ఉమా తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఘంటా కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, విజయవాడ నందు
SOP No. : 4/2025

1. **Malaji Swarupa Rani** alias Kancherla Swarupa Rani
2. **Malaji Siddartha** ..*Pititioners*

and

1. **Malaji Gopi Chand Rohit**
2. **Malaji Bhodhi Sattava Roshan**
3. **Malaji Kirthi Nirmala** (Respondents 1 to 3 are minors Rop by their mother) (Korukonda L. Sowjanya)
4. **Korukonda Lakshmi Sowjanya**
5. **Andhra Pradesh Pollution Control Board** Rep. by Member Secretary, Autonagar, Vijayawada.

పైన పేర్కొన్న SOP No. 4/2025 ను 1వ పిటీషనర్ భర్తయును, రెండవ పిటీషనర్ తండ్రియును అయిన మాలాజి నాగార్జున గారు చనిపోవుట చేత సదరు మాలాజీ నాగార్జున గారు 5వ రెస్పాండెంట్ నందు ఉద్యోగము చేయుచు మరణించుట చేత సదరు మాలాజీ నాగార్జున గారికి 5వ రెస్పాండెంట్ వద్ద నుండి రావలసిన షెడ్యూల్‌లో పేర్కొన్నటువంటి Death benefits వగైరాలు నిమిత్తమై 1, 2 పిటీషనర్లు succession certificate కొరకు మరియు చనిపోయిన మాలాజీ నాగార్జున గారి family pension కొరకు, చనిపోయిన మాలాజీ నాగార్జున గారి తరఫున 2వ పిటీషనర్‌కు compassionate employment కొరకు SOP No. 4/2025 ను దాఖలు చేసియున్నారు. సదరు SOP. No. 4/25 ది. 10-4-2025 నకు వాయిదా అయివున్నది. దిగువ పేర్కొన్న షెడ్యూలు పైన మరియు SOP No. 4/2025 పైన ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని వున్నయెడల ది. 10-04-2025న సదరు కోర్టు వారి ఎదుట హాజరయి తమ అభ్యంతరములు తెలుపవలసినది. లేనియెడల కోర్టు వారు తదుపరి చర్యలు తీసికొనగలరు.

షెడ్యూలు

1. Enhanced Family Pension - 65,290-00+ Dr. w.e.f. 21-12-23 to 20-12-2033.
2. Normal family pension - 39,174-00+Dr. w.e.f. 21-12-2023 to 20-12-2033.
3. Arrears of pension 4,92,671 (w.e.f. 21-12-2023 to 31-05-2024)
4. Group Gratuity : Rs. 20,00,000/-
5. Final Encashment of EL & HPL Rs. 18,41,981-00.

Total amount is Rs. 44,39,116-00

- కోర్టు వారి ఉత్తర్వులతో -

ది. 27-3-25
విజయవాడ

ఇట్లు, **K. Jogeswara Rao,** Advocate
Seshadri Sastri Street, Governorpet,
Vijayawada. Ph : 93934 34471